సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



పటిష్టమైన నిఘా తప్పనిసరి

జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ వద్ద 24 గంటలలు పటిష్టమైన నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. -8లో



జలసంరక్షణ పనులకు ప్రాధాన్యత

జల సంరక్షణ, పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని సెంట్రల్ నోడల్ అధికారి ప్రకాష్ కచ్చి, జియాలజిస్ట్ ఏఎస్.పవార్ అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 201 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	461	465
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 737.900 కిలోలు

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్: మాజీ సైనిక పిల్లలకు ప్రధాన మంత్రి ఉపకార వేతన పథకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి ఐజె రఘురామయయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో 60శాతం మార్కులు తెచ్చుకుని ఈ ఏడాది ఎంబీబీఎస్/ బీడీఎస్/ బీటెక్/ ఎంసీఏ వంటి కోర్సుల్లో చేరిన వారు దీనికి అర్హులన్నారు. కేంద్రీయ సైనిక్ బోర్డు వారి వెబ్‌సైట్ www.ksb.gov.in ద్వారా జనవరి 1 నుంచి 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ పథకం ద్వారా మగ పిల్లలకు రూ.30 వేలు, ఆడ పిల్లలకు రూ.36 వేలు స్కాలర్‌షిప్ వస్తుందన్నారు.

సంపద సృష్టి కేంద్రాల పరిశీలన



ఎస్‌డబ్ల్యుపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ ధనలక్ష్మి

చిన్నమండెం: మండల పరిధిలోని మల్లూరు, టి.చాకిబండ గ్రామాల్లోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇండ్ల నుంచి సేకరించిన పొడి చెత్త, తడి చెత్తలను వేరు చేసి రీసైక్లింగ్ చేయాలన్నారు. అనంతరం వాటిని పలు రకాల వస్తువుల తయారీకి ఉపయోగించి సంపదను సృష్టించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ పవన్‌కుమార్, పంచాయతీ సెక్రటరీలు రాజేంద్రప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్య

రాయచోటి అర్బన్: జిల్లాలోని ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్‌సెంటర్‌లు తదితరాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య తెలిపారు. లింగ ఆధారిత హింస, లింగ వివక్షతపై ,పీసీపీఎన్‌డీటీ చట్టంపై 3 రోజుల డివిజనల్ స్థాయి అవగాహన కార్యక్రమం గురువారం పట్టణంలోని కె.రామాపురం అర్బన్ హెల్త్‌సెంటర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలను వెల్లడించిన వారికి జరిమానా, జైలుశిక్షలు తప్పవన్నారు. జిల్లా పీసీపీఎన్‌డీటీ చట్టం నోడల్ అధికారి ఉషశ్రీ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే ద్వారా బాలికల నిష్పత్తి తగ్గిందన్నారు. జిల్లా పీసీఎన్‌డీటీ ప్రోగ్రాం అధికారిణి దేవశిరోమణి, ఉషారాణి, రాజగోపాల్, రాయచోటి డివిజన్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు పాల్గొన్నారు.

సాధికార గర్జన



బస్సు యాత్రలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం తదితరులు



రాయచోటిలో జరిగిన సామాజిక సాధికార యాత్రకు భారీగా హాజరైన ప్రజలు

- జనంతో పోటెత్తిన రాయచోటి
- విజయవంతమైన సామాజిక సాధికార యాత్ర
- ప్రభుత్వం చేసిన మేలును వివరించిన ప్రజాప్రతినిధులు

రాయచోటి: అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో జరిగిన సామాజిక సాధికార యాత్రకు అనూహ్య స్పందన లభించింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు విచ్చేసిన సామాజిక సాధికార యాత్రను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా జెండా ఊపి ప్రారంభించారు. వేడిని సైతం లెక్కచేయకుండా వేలాదిగా హాజరైన ప్రజలు, నాయకుల ప్రసంగాలను ఓపిగ్గా విన్నారు. ఈ యాత్రలో శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానమ్, ఎంపీ నందిగం సురేష్, మాజీమంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, రమేష్‌యాదవ్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బడుగు, బలహీనుల పక్షాన నిలబడిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ.

వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలు

రాయచోటిలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతమైంది. నియోజకవర్గ పరిధిలోని 6 మండలాల్లోని గ్రామాల ప్రజలు ఒక్కటి కావడంతో పట్టణంలోని చిత్తూరు–కడప జాతీయ రహదారి జన ఉప్పెనై పొంగింది. జెండాలను రెపరెపలాడిస్తూ జనం కదం తొక్కారు. రాయచోటి పరిధి రింగురోడ్డులోని అభి కళ్యాణమండపం నుంచి మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన బస్సుయాత్రకు అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు.

సామాజిక న్యాయాన్ని, ధర్మాన్ని పాటించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలకు ఒరిగిన అభివృద్ధిని వారు వివరించారు. అలాగే రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల ప్రజలకు జరిగిన సామాజిక న్యాయాన్ని జగనన్న పాలనలో అందుతున్న వైనాన్ని తెలియపరిచారు. తమ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చిన ప్రాధాన్యత రాష్ట్ర చరిత్రలోనే కాకుండా దేశచరిత్రలోనే లేదన్నారు. సంక్షేమ కార్యక్రమాలలో పెత్తందారీ పోకడలు ఉన్న పార్టీలు అడుగడుగునా అడ్డుపడుతున్నా ఎక్కడా వెనుకడుగు వేయలేదన్నారు.

సంక్షేమ సారథి జగనన్న : ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అందిస్తూ పేదల గుండెల్లో సంక్షేమ సారథిగా...ఎక్కడ చూసినా అభివృద్ధి పనులతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటికి ఎవరూ ఊహించని స్థాయిలో ఒక పెద్ద పరిశ్రమను తీసుకొస్తానని అన్నారు. 3000–3500 మందికి ఉపాధి కల్పించేలా పరిశ్రమ తీసుకొచ్చి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించడానికి శాయశక్తులా కృషి చేస్తానని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేదలకు మంచి జరగాలని అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారన్నారు. సామాజిక సాధికార యాత్ర లక్ష్యం ఈ నాలుగున్నరేళ్లలో బడుగు,బలహీన,మైనార్టీ వర్గాలకు జగనన్న వల్ల జరిగిన మేలును తలచుకోవడమేనని తెలిపారు. చంద్రబాబు జిల్లా కేంద్రాన్ని మారుస్తానని చెబుతున్నారని, తన ప్రాణం ఉన్నంతవరకు జిల్లా కేంద్రాన్ని మార్పు చేయనీయనని తెలిపారు. అన్నమయ్య జిల్లా అంటేనే రాయచోటి అని గుర్తు వచ్చేలా చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాయచోటిలో స్టేడియం, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, డీఎస్పీ కార్యాలయం, నూతన పోలీసుస్టేషన్‌తోపాటు అన్ని రంగాల్లోనూ రాయచోటి అభివృద్ధిలో దూసుకుపోతున్నదని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాయచోటి నియోజకర్గానికే ఈ నాలుగున్నరేళ్లలో పథకాల కోసం, అభివృద్ధి పనుల కోసం రూ.1289 కోట్ల ప్రయోజనం కల్పించారన్నారు. ఒక్క రాయచోటి నియోజకవర్గానికే డీబీటీ ద్వారా రూ.934 కోట్లు, నాన్ డీబీడీ కింద రూ.355 కోట్లు ఖర్చు చేశారన్నారు.

వైఎస్ జగన్‌తోనే సామాజిక న్యాయం

ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, చిత్రంలో నందిగం సురేష్, ఆకేపాటి, రమేష్‌యాదవ్, జకియాఖానం

రాయచోటి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఆర్థికంగా, సామాజికంగా, విద్య, రాజకీయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర కార్యక్రమానికి పలువురు నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానమ్, ఎంపీ నందిగం సురేష్ వివిధ వర్గాల నాయకులతో కలిసి మాట్లాడారు. సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో వివిధ వర్గాల వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2.5 లక్షల కోట్ల రూపాయల నిధులను నేరుగా లబ్ధిదారులకే జమ చేశారన్నారు. రాష్ట్రంలో జగన్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమైందన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సాధికార యాత్రకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోందన్నారు. యాత్రలు విజయవంతం అవుతుండటంతో ప్రతిపక్షాలకు భయం పుట్టుకుందన్నారు. చంద్రబాబు నాయీబ్రాహ్మణుల తోక కత్తిరిస్తామనడం, ఎస్టీలలో ఎవరు పుట్టాలనుకుంటారని, బీసీలు ఉన్నత పదవులకు పనికిరారని చెప్పడం దుర్మార్గమన్నారు. హోంమంత్రి విద్యాశాఖా మంత్రులుగా ఎస్సీలు, ఉపముఖ్యమంత్రి గా మైనార్టీలకు ఇవ్వడం దేశంలో ఎవరూ చేయలేని ఒక చరిత్రను సీఎం జగన్ సృష్టించారన్నారు.

- సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం మహిళలకు అన్ని వర్గాల వారికి న్యాయం జరిగిందని మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం అన్నారు. సాధారణ మహిళనైన తనకు శాసనమండలి సభ్యురాలుగా చేయడంతో పాటు మండలి డిప్యూటీ వైస్ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వడం మామూలు విషయం కాదన్నారు.సీఎం వైఎస్ జగన్ మైనార్టీల పక్షపాతి అని అన్నారు.
- ప్రజల సంక్షేమం కోసం కుల, మత, బేధాలు లేకుండా పారదర్శక పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎంపీ నందిగం సురేష్ అభిప్రాయపడ్డారు. చేనేత, వాహనమిత్రలు వివిధ కులవృత్తుల వారికి సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నారని తెలిపారు.పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకు జగనన్న పాలనలో న్యాయం జరుగుతుందన్నారు. 2024లో జరిగే ఎన్నికలలో ఎమ్మెల్యేగా శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీగా మిథున్‌రెడ్డిలను 50 వేల మెజార్టీతో గెలిపించుకొని మళ్లీ జగనన్నను సీఎంగా చేసుకోవాలన్నారు.
- బీసీలంటే బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదని బ్యాక్ బోన్ అని జగనన్న నిరూపించారని ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ అన్నారు. అన్ని నియోజకవర్గాల్లో సీఎం జగన్ చేసిన అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమాన్ని చూసి సామాజిక సాధికారిక యాత్రకు ఎస్సీ, ఎస్టీ, మైనారీ, బీసీలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా, అందరూ ఏకమైనా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఓడించలేరన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా పార్టీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గణితంలో బంగారుపతకం



పీజీ డిగ్రీ అందుకుంటున్న హమీదా పర్వీన్

కడప ఎడ్యుకేషన్: కడప నగరం రూకవారిపల్లెకు చెందిన షేక్ హమీదా పర్వీన్‌కు డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ మ్యాథ్స్‌లో బంగారు పతకాన్ని లభించింది. గురువారం యూనివర్సిటీ 25వ స్నాతకోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో వీసీ నుంచి పతకంతో పాటు స్నాతకోత్సవ పీజీ డిగ్రీ పట్టాను ఆమె అందుకున్నారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, చిత్రంలో జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, డీఈఓ రాఘవరెడ్డి తదితరులు

- విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి
- రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జెడ్పీ చైర్మెన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: మనదేశ శాస్త్రవేత్తలు సీవీరామన్, ఏపీజే అబ్దుల్‌కలాం లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని, దేశానికి సేవచేయాలని, విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. గురువారం కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ జరిగింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజం, టీచర్స్ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా వారు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి అధ్యక్షతన, జిల్లా సైన్స్ అధికారి బి. మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌ను కడపలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. విద్యకు రూ. 40 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం విద్యకు ఇంత పెద్ద మొత్తంలో బడ్జెట్‌ను కేటాయించలేదన్నారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రతి పేదవాడు ఉన్నత విద్యను అభ్యసించే విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టారన్నారు. తండ్రిని ఆదర్శంగా తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడు కూడా ఉన్నత స్థితికి ఎదిగేందుకు పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని తెలిపారు.పేదల పిల్లలు కూడా చదువుకోవాలనే లక్ష్యంతో అమ్మ ఒడి పథకాన్ని తెచ్చారన్నారు. అలాగే విదేశీ విద్యాదీవెనతో చాలా మంది నేడు ఇతర దేశాలకు వెళ్లి చదువుకుంటున్నారని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులను వారు పరిశీలించారు. వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో జ్యూరీ సభ్యులుగా మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ పత్తి కృష్ణారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓలు రాజగోపాల్‌రెడ్డి, కృష్ణయ్య, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి, మాజీ సైన్స్ అధికారులు రవికిరణ్, నిత్యానందరెడ్డి, రెహమాన్, కార్పొరేటర్ షఫీ, నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, అహమ్మద్, కడప ఎంఈఓ పాలెం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలు అదరహో

కడప ఎడ్యుకేషన్: చిన్నారులు తమ మేధస్సుకు పదును పెట్టి వినూత్న ఆలోచనలతో సాంకేతికను అందిపుచ్చుకున్నారు. చిట్టి బుర్రలో మెదిలిన చక్కటి ఆలోచనతో అద్భుత ఆవిష్కరణలను ప్రదర్శించారు. శాస్త్ర సాంకేతికత, పర్యావరణ, సామాజిక రంగాల నుంచి వైవిధ్యమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన రాష్టస్థాయి సైన్స్‌ఫేర్ ఆకట్టుకుంది. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. 234 ప్రాజెక్టులు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.

ప్రాజెక్టు పేరు: స్టాప్ సూసైడ్

గైడ్ టీచర్ : రామకృష్ణ

విద్యార్థులు: పూజశ్రీ, శాంతిసౌమ్య 9వ తరగతి

స్కూల్‌పేరు: జెడ్పీ హైస్కూల్, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా

ప్రధానాంశం: నేడు చాలా మంది చిన్న విషయాలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇళ్లలో ఫ్యాన్లకు ఉరివేసుకోవడం లేదంటే భవంతులపై నుంచి దూకడం వంటివి చేస్తున్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు శోకం మిగుల్చుతున్నారు. వీటిని నివారణకు సంబంధించిన ప్రదర్శనను చిన్నారులు చూపారు. ఇంట్లో ఏర్పాటు చేసే ఫ్యాన్‌కు స్ప్రింగ్, బాల్‌ను ఏర్పాటు చేసుకుంటారు. దానికి మనిషి ఉరి వేసుకోగానే ఆటోమేటిక్‌గా కిందకు వచ్చి నేలకానుతుంది. దీంతో ఉరి వేసుకునేందుకు వీలుకాదు. అలాగే ఇంటిని నిర్మించుకునే ముందు గ్రౌండ్‌ఫ్లోర్ చుట్టూ సెన్సార్, భవనానికి చుట్టూ నెట్‌ను కూడా ఏర్పాటు చేసుకుంటారు. ఎవరైనా ఆ భవనం మీదకు వెళ్లి దూకేందుకు ప్రయత్నం చేయగానే కింది భాగంలో ఏర్పాటు చేసిన సెన్సార్ గ్రహించి వెంటనే నెట్ ఓపెన్ అవుతుంది. దీంతో దూకిన వాళ్లు ఆ వలలో పడి ప్రాణాలను కాపాడుకునేందుకు వీలవుతుంది.



స్టాప్ సూసైడ్ ప్రాజెక్టుతో విద్యార్థులు, ఉపాధ్యాయుడు


స్మార్ట్ మల్టీపర్పస్ వీల్‌చైర్

గైడ్ టీచర్ : టైటస్

విద్యార్థులు: మహలక్ష్మి, నాగచైతన్య, 10వ తరగతి

స్కూల్‌పేరు: సీకేజేఆర్‌సీ ఎయిడెడ్ స్కూల్, మంగళగిరి

ప్రధానాంశం: సోలార్ ప్యానల్ ద్వారా తయారు చేసిన ఈ స్మార్ట్ మల్టీపర్పస్ వీల్ చైర్‌తో వికలాంగులు, గర్భిణులు, వృద్ధులకు ఎంతో మేలు. దీనికి ఏర్పాటు చేసిన సోలార్ ఎనర్జిటిక్ మోటార్ ద్వారా ముందుకు వెనక్కు వెళుతుంది. దీనికి సంబంధించి కంట్రోలర్ కూడా వీరి చేతిలోనే ఉంటుంది. అలాగే చైర్‌లో వీరు అనుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన స్మార్ట్ పిల్లో ద్వారా పొరపాటున ఏదైనా అయ్యి (అపస్మారక స్థితి) అటు ఇటు వాలిపోతే పిల్లోలో ఉండే అలారమ్ మోగుతుంది. దీంతో సంబంధిత వ్యక్తులు స్పందించి ప్రమాదం నుంచి వారిని కాపాడేందుకు వీలుంటుంది.



స్మార్ట్ మల్టీపర్పస్ వీల్ చైర్‌తో ఉపాధ్యాయుడు, విద్యార్థులు

సోలార్ సెన్సార్డ్ క్యాటిల్ షెడ్

గైడ్ టీచర్: వీఎస్‌ఏ లక్ష్మి

విద్యార్థిపేరు: చింత అనీలా సుధ, ప్రభుత్వ బాలికల హైస్కూల్, అమలాపురరం, అంబేడ్కర్ కొనసీమజిల్లా

ప్రధానాంశం: అధిక మొత్తంలో పశువుల పెంపకం చేసే వారికి ఈ సోలార్ సెన్సార్డ్ క్యాటిల్ షెడ్ ఉపయోగకరంగా ఉంటుంది.ఇది సోలార్ ఎనర్జీ ఎన్సార్డ్ ద్వారా పనిచేసే మోటార్, కన్వీనర్ బెల్ట్ ద్వారా పశువులకు ఆహారంతోపాటు నీరు అందించొచ్చు. ఫలితంగా పశువుల పెంపకంలో శ్రమ దగ్గుతుంది. ఈ సోలార్ సెన్సార్డ్ ద్వారా తక్కువ ఆహారం తీసుకుంటున్న పశువులను గుర్తించి వాటి ఆరోగ్య పరిరిస్థితిని తెలిసుకోవచ్చు.



ప్రాజెక్టుతో గైడ్ టీచర్, విద్యార్థి

వ్యర్థాలతోనే శుభ్రం

గైడ్ టీచర్: రామలక్ష్మి

విద్యార్థిపేరు: లావణ్య, 9వ తరగతి, శ్రీగౌతమ్ మున్సిపల్ హైస్కూల్, మండపేట, కొనసీమజిల్లా

ప్రధానాంశం: వ్యర్థాలను ఉపయోగించి తయారు చేసిన లిక్విడ్ ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపనుంది. దీని ద్వారా గ్రీన్ హౌస్ ఎఫెక్ట్‌ను తగ్గించడానికి, అలాగే వాతావరణ కాలుష్యానికి పరిష్కారం దొరుకుతుంది. పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడుతుంది.



ప్రాజెక్టులతో విద్యార్థి, గైడ్ టీచర్

రైళ్లలో అగ్నిప్రమాదాల నివారణ

గైడ్ టీచర్: పాపారావు

విద్యార్థులు: దిలీప్‌కుమార్, ఓం మహాపాత్రో, జెడ్పీ హైస్కూల్, కొలిగం, శ్రీకాకుళం జిల్లా

ప్రధానాంశం: ఇటీవల నిత్యం ఏదో ఒకచోట రైళ్లలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో ముఖ్యంగా అగ్నిప్రమాదాల వల్ల పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. దీని నివారణకు రైలులోని ప్రతి బోగీలో సాధారణ ఉష్ణోగ్రతలను గ్రహించేలా సెన్సార్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ సెన్సార్ రైలును నడిపే డ్రైవర్‌కు అనుసంధానంగా ఉంటుంది. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదాలు జరిగినపుడు బోగీలో ఏర్పాటు చేసిన సెన్సార్ వేడిని గుర్తించి వెంటనే సంబంధిత సమాచారాన్ని డ్రైవర్‌కు చేరవేస్తుంది. దీంతో డ్రైవర్ అప్రమత్తమై రైలును ఆపి వెంటనే ప్రయాణికులను ప్రమాదం బారి నుంచి కాపాడేందుకు అవకాశం ఉంటుంది



ప్రాజెక్టుతో విద్యార్థులు

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : భర్త మందలించడంతో మనస్తాపం చెంది వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని బాబు కాలనీకి చెందిన అంకన్న భార్య నందిని(28) కుటుంబ సమస్యల కారణంగా భర్తతో గొడవ పడింది. ఇతరుల ఇళ్లకు వెళ్లవద్దని భర్త మందలించడంతో మనస్తాపం చెంది ఇంట్లోనే నిద్ర మాత్రలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని వెంటనే స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటోంది.

బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో బైక్ అదుపు తప్పి యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం ఉదయం కురబలకోట మండలంలో జరిగింది. మదనపల్లె చంద్రాకాలనీకి చెందిన శివరాజ్‌కుమార్ (25) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో అంగళ్లుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మార్గమధ్యంలోని విశ్వం కాలేజీ వద్ద రోడ్డు మరమ్మతులు జరుగుతున్న ప్రదేశంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో శివరాజ్‌కుమార్ తీవ్రంగా గాయపడగా, స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మద్యం సీసాలు ధ్వంసం



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ అధికారులు

రాయచోటి టౌన్ : జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన మద్యం సీసాలను జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు ఎస్ఈబీ అధికారులు ధ్వంసం చేశారు. గురువారం సాయంత్రం రాయచోటి పట్టణ శివార్లలో ఎస్ఈబీ ఈఎస్‌వీ శ్రీనివాసులు, ఎస్ఈబీ ఏఈఎస్ ఎం.రవిల ఆధ్వర్యంలో మొత్తం 74 కేసులకు సంబంధించి రూ. 3,56,960ల విలువైన 2,451 బాటిళ్ల మద్యం సీసాలు, 456 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు.

పటిష్టమైన నిఘా తప్పనిసరి

ఈవీఎం గోడౌన్ తనిఖీలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ప్రభుత్వవిప్, అధికారులు

రాయచోటి : జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ వద్ద 24 గంటలలు పటిష్టమైన నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీలో భాగంగా రాయచోటి పట్టణం మార్కెట్ యార్డులో ఉన్న ఈవీఎం గోదామును గురువారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. గోదాము లోపల భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్‌లను, అక్కడి భద్రతా చర్యలను జిల్లా కలెక్టర్ పరిశీలన చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాకు మొత్తంగా 4893 బీయూలు, 7220 సీయూలు, 4847 వీవీ ప్యాట్‌లు వచ్చాయని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వీటి తనిఖీ పూర్తి చేసినట్లు చెప్పారు. ఇందులో 4817 బీయూలు బాగున్నాయని, 76 డిఫెక్ట్ వచ్చాయన్నారు. అలాగే 4140 సీయూలు బాగున్నాయని, 80 డిఫెక్ట్, 4770 వివి ప్యాట్ బాగున్నాయని, 77 డిఫెక్ట్ ఉన్నట్లు తెలిపారు. డిఫెక్ట్ ఉన్న వాటిని తిప్పి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓ రంగస్వామి, తహశీల్దార్ ప్రేమంత్ కుమార్, ఎన్నికల సెల్ సూపరిటెండెంట్ కృష్ణమోహన్, భాను గోపాల్ రాజు, శివప్రసాద్, బీఎస్పీ యుగంధర్, రియాజ్, ఐయూఎంఎల్ ఎస్ఎస్ బాష తదితర రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

■ పేదలకు భూ పంపిణీ చేసేందుకు భూసేకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తహసీల్దార్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాకలెక్టర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని పేదలందరికీ అసైన్మెంట్ భూములు పంపిణీ చేసేందుకు జనవరి 3వ తేదీ లోపల భూసేకరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. వాగులు, వంకలు, కొండలు, గుట్టలు కాకుండా వ్యవసాయానికి ఉపయోగపడే భూములు గుర్తించాలని తహసీల్దార్లకు సూచించారు.

పండుగలా సంక్షేమ ఫలాల పంపిణీ

రాయచోటి అర్బన్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు పండుగ వాతావరణంలో పంపిణీ చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి జిల్లాకలెక్టర్ గిరీషా పీఎస్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, జాయింట్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 1 నుంచి 8వతేదీ వరకు వైఎస్ఆర్ పెన్షన్ కానుక, జనవరి 23వతేదీ నుంచి వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం, ఫిబ్రవరి 5న వైఎస్ఆర్ చేయూత పథకం ప్రారంభించనున్నట్లు చెప్పారు. చేయూత పథకం కింద 5నుంచి 14వతేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పథకాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారిని భాగస్వాములను చేయాలన్నారు.

రెండు ఆటోలు ఢీ

ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెల్ల గ్రామ సమీపంలో గురువారం రాత్రి రెండు ఆటోలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా.. మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తొండూరు మండలం గోటూరు గ్రామానికి చెందిన రామిరెడ్డి చంద్ర ఓబుళ రెడ్డి పులివెందుల పట్టణంలోని పాత బస్టాండు సమీపంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో టీవీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. రోజు మాదిరిగానే గోటూరు గ్రామం నుంచి పులివెందులకు మెకానిక్ పనిచేసుకుని తిరిగి సొంత గ్రామానికి ఆటోలో వెళుతుండగా.. నల్లచెరువుపల్లె నుంచి పులివెందుల వైపు వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో మెకానిక్ రామిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. రవి అనే మరొక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.



మృతి చెందిన రామిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డి



తీవ్రంగా గాయపడిన రవి

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


సొంతింటి కల సాకారమైంది



దినసరి కూలికి వెళితేనే మా జీవనం సాగుతుంది. కనీసం సెంటు స్థలం కూడా కొనలేని పరిస్థితి. అద్దె ఇంట్లో ఉన్నాము. గతంలో చాలా సార్లు ఇంటి స్థలం కోసం అర్జీలు పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన వచ్చిన తరువాత ఆఫీసుల చుట్టూ తిరగకుండానే నాకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరైంది. ఇప్పుడు నేను జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్నాను. జగన్ పుణ్యమా అని నాకు సొంత ఇంటి కల నెరవేరింది.

- మండ్ల హుసేనమ్మ, జగనన్న కాలనీ, సిద్దవటం

నాడు-నేడు అద్భుతం



జగనన్న ప్రభుత్వం నాడు నేడు కింద పాఠశాలల రూపురేఖలు మార్చేసింది. కార్పొరేట్ విద్యకు దీటుగా విద్యను అందిస్తోంది. ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా విద్యకు జగనన్న ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ప్రతి పేద కుటుంబంలోని విద్యార్థులకు ఉన్నత చదువులు చదివేందుకు ప్రభుత్వం ఫీజు రీఎయింబర్స్‌మెంటు పథకం ప్రవేశపెట్టింది. పేద విద్యార్థుల తల్లులకు వైఎస్ జగన్ భరోసా కల్పించారు.

- పి. భూపతిరెడ్డి, పారంపల్లె, గాలివీడు మండలం

పేదలకు నేరుగా సాయం చేసిన సీఎం



మా సొంతింటి కల ఎట్టకేలకు జగనన్నతో నెరవేరిందని గట్టిగా నమ్ముతున్నాం. సొంతిల్లు లేక సుమారు 15 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే నివాసం ఉన్నాం. జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరుతో పాటు ఇంటి నిర్మాణానికి సహకారం అందించడంతో మా కల నెరవేరింది. ఈ స్థాయిలో పేదలకు నేరుగా సహాయం చేసిన ముఖ్యమంత్రిని ఇప్పటి వరకు చూడలేదు. లెక్కలేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేశారు. ఆయన పథకాలతో లబ్ధిపొందని కుటుంబం లేదు. తప్పకుండా ఆయనకు అండగా ఉంటూ 2014 ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందాం.

- మాసన రామచంద్ర, రామాపురం మండలం

ట్రిపుల్ ఐటీలో న్యాక్ బృందం పర్యటన

మూడు రోజులపాటు వివిధ విభాగాల్లో పరిశీలన



ట్రిపుల్ ఐటీలో వివరాలను అడిగి తెలుసుకుంటున్న న్యాక్ బృంద అధికారులు

వేంపల్లె : నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్(న్యాక్) గుర్తింపు వస్తే అంతర్జాతీయ స్థాయిలో వివిధ కంపెనీలలో విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ ఆర్జీయూకేటీ చాన్సలర్ ప్రొఫెసర్ కె.చెంచురెడ్డి పేర్కొన్నారు.

హర్యానా సోన్ పాట్ దీనబంధు చోటు రామ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వైస్ చాన్సలర్ డాక్టర్ రాజేంద్రకుమార్, చైర్ పర్సన్ అనాయత్‌ల ఆధ్వర్యంలో 8మంది న్యాక్ బృందం ఆర్‌కేవ్యాలీ ట్రిపుల్ ఐటీని సందర్శించారు. మూడు రోజులపాటు ఆర్‌కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో అన్ని విభాగాలలోని తరగతి గదులు, వసతి గృహాలు, ప్రయోగశాలలో కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా మైదానం, ఎన్ఎస్ఎస్ విభాగాలు, లైబ్రరీ, ఒకేషనల్ విభాగాలు తదితర వాటిని సందర్శించనున్నారు. గురువారం సివిల్ విభాగానికి సంబంధించి ల్యాబ్‌లను పరిశీలించి అనంతరం తల్లిదండ్రులు, విద్యార్థులు, అధ్యాపకులతో వేర్వేరుగా సమావేశం ఏర్పాటు చేసి అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. క్యాంపస్‌లో ఉన్న సెంట్రల్ లైబ్రరీ, వివిధ విభాగాల కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం కూడా వివిధ విభాగాలలో పరిశీలించి ఉన్నతాధికారులకు న్యాక్ బృందం నివేదికలు పంపనున్నారని తెలిపారు. కార్యక్రమంలో వీసీ విజయ్‌కుమార్, డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, ఏఓ రాంభూపాల్‌రెడ్డి, అకడమిక్ డీన్ రత్న కుమారి, సివిల్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ అమరేంద్ర కుమార్ సంద్ర, అనిల్‌కుమార్‌రెడ్డి, పీఆర్‌ఓ తిరుపతిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో రెడ్డెమ్మ కొండ అభివృద్ధి

రెండోసారి చైర్మన్‌గా నరసింహారెడ్డి



నూతన ఆలయ పాలకమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్ నరసింహారెడ్డి, ఇతర సభ్యులు

గుర్రంకొండ : రూ.3 కోట్ల నిధులతో శ్రీ రెడ్డెమ్మకొండ ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని శ్రీ రెడ్డెమ్మకొండ ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో ఆలయ పాలక మండలి నూతన సభ్యుల ప్రమాణస్వీకారం వైభవంగా నిర్వహించారు. మదనపల్లె దేవదాయశాఖ ఇన్స్‌పెక్టర్ రవి కుమార్‌రెడ్డి, రెడ్డెమ్మకొండ ఈఓ మంజుల ఆధ్వర్యంలో నూతన చైర్మన్‌గా టి. నరసింహారెడ్డి, పాలకమండలి సభ్యులుగా మల్లెల వెంకటేష్, నక్కామధుసూధన్, రూపిలమ్మ, భాగ్యమ్మ, సరస్వతమ్మ, శాంతమ్మలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలయంలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని త్వరలోనే పనులను పూర్తి చేస్తామన్నారు. నూతన పాలకమండలికి అవకాశం కల్పించిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రవినాయక్, జెడ్పీటీసీ నస్రీన్ ముక్తియార్, సింగిల్‌విండో చైర్మన్ నక్కాచంద్రశేఖర్, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు కందుల గుణశేఖర్, వైస్ ఎంపీపీ కరుణాకర్, మాజీ ఎంపీపీ జమీర్, సర్పంచ్ జగన్‌మోహన్, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ గణేష్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడిపై దాడి


- తంబళ్లపల్లె బీజేపీలో వర్గపోరు
- మదనపల్లె జిల్లా ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత



గోపాల్‌రెడ్డిపై దాడికి పాల్పడుతున్న అన్నెగానిపల్లె శేఖర్

మదనపల్లె : తంబళ్లపల్లె బీజేపీ సీనియర్ నాయకుడు, బీజేపీ రాష్ట్ర కో–ఆపరేటివ్ సెల్ జాయింట్ కన్వీనర్ బి.గోపాల్‌రెడ్డి(56)పై బీజేపీలోని మరో వర్గం నేతలు దాడికి పాల్పడ్డారు. గురువారం తంబళ్లపల్లె మండలంలోని దిగువపాళెం పంచాయతీ అన్నెగానిపల్లె, గంగిరెడ్డిపల్లెల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు నిర్వహించారు. కార్యక్రమం జరుగుతుండగానే, సాయంత్రం 4.30 గంటల సమయంలో గోపాల్‌రెడ్డి స్వగ్రామం బురకాయలకోటకు బయలుదేరారు. చౌడసముద్రం గంగిరెడ్డిపల్లె మార్గమధ్యంలో బీజేపీలోని అసంతృప్త నేత, మాజీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అన్నెగానిపల్లెకు చెందిన శేఖర్, అతడి అనుచరుడు సుంచుగారిపల్లెకు చెందిన మహేష్‌రెడ్డి ఇద్దరూ కలిసి గోపాల్ రెడ్డిని అటకాయించారు. ద్విచక్రవాహనాన్ని కిందపడేసి విచక్షణారహితంగా దాడిచేశారు. అనుమతి లేకుండా మండలంలోకి రావడం పొరపాటేనని, అంగీకరిస్తూ, కాళ్లమీద పడతానని ప్రాధేయపడ్డా, ఏ మాత్రం కనికరం చూపకుండా ఇష్టంవచ్చినట్లుగా బూతులు తిడుతూ కొట్టారు. దాడిలో గోపాల్‌రెడ్డికి కుడిచేయి విరగ్గా తీవ్రంగా గాయపడ్డారు. గోపాల్‌రెడ్డిపై దాడి ఘటనను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో తంబళ్లపల్లె నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. దాడి ఘటనలో గాయపడ్డ గోపాల్ రెడ్డిని తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్సకు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలిస్తున్నారని తెలిసిన వెంటనే పట్టణంలోని బీజేపీ నాయకులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ఆస్పత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడటంతో టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని నాయకులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు. దాడికి సంబంధించిన వివరాలను సేకరించారు.

సీటీఎం రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మదనపల్లె : మండల పరిధిలోని సీటీఎం రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి(55) మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. సీటీఎం రైల్వేస్టేషన్‌లో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి కదిరి రైల్వేపోలీసులకు సమాచారం అందించారు. బుధవారం రాత్రి కదిరి రైల్వే ఎస్ఐ రహీం సీటీఎం రైల్వేస్టేషన్‌కు చేరుకుని మృతుని వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించారు. అయితే మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు రైళ్లలో భిక్షాటన చేస్తూ జీవించేవాడని స్థానికులు పోలీసులకు తెలిపారు. ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం సాయంత్రం స్టేషన్‌లోకి వచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడని తెలిపారు. మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాత భవనం కూలి ఇద్దరు మృతి

మరో నలుగురికి గాయాలు






ప్రమాదంలో మృతి చెందిన కూలీలు

తిరుపతి క్రైమ్ : తిరుపతి నగరంలో పాత భవనం కూలుస్తుండగా ప్రమాదవశాత్తు ఒక్కసారిగా కూలిపోయి ఇద్దరు కూలీలు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వెస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని మంచాల వీధిలో నివాసం ఉంటున్న షబ్బీర్ అదే ప్రాంతంలో తన పాత ఇంటిని కూల్చేందుకు మోషన్ బాషా అనే వ్యక్తికి కాంట్రాక్ట్ ఇచ్చాడు. అతను ఆరుగురు కూలీలను తీసుకొచ్చి పాత భవనాన్ని కులుస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలింది. ఇందులో అనంతపురం జిల్లా కదిరికి చెందిన నారాయణ(40), వైఎస్సార్ జిల్లా పొద్దుటూరుకు చెందిన నరసింహులు(50) తీవ్రంగా గాయపడి మృతి చెందారు. అయితే ఇదే ప్రమాదంలో ఒక మహిళతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పాత భవనం కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా తడవడం వల్ల వీరు కూల్చే సమయంలో అదే కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. అయితే పూర్తి వివరాలు కూలీలకు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

ఒకే రాత్రి మూడు దుకాణాల్లో చోరీ



చోరీ జరిగిన టీవీ మెకానిక్ దుకాణం

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్ట జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న మూడు దుకాణాల్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుల సమాచారం మేరకు...ఒంటిమిట్ట జడ్పీహెచ్ఎస్ ఎదురుగా వరుసగా ఉన్న టీవి మెకానిక్ దుకాణం, ఆన్‌లైన్ సర్వీస్ దుకాణం, వెస్టర్న్ యూనియన్ దుకాణంలో బుధవారం రాత్రి ముఖ ద్వారానికి వేసిన తాళాలను పగుల గొట్టి టీవీ మెకానిక్ దుకాణంలోని ఓ టీవీని, ఆన్‌లైన్ సర్వీస్ దుకాణంలో దాదాపు రెండు వేల రూపాయల నగదును, వెస్ట్రన్ యూనియన్ దుకాణంలో ఒక సెల్ ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. గురువారం ఉదయం దుకాణాలు తెరిచేందుకు వచ్చి వారు దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అయితే తమకు రాతపూర్వకంగా బాధితులు ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.

టమాట తరలిస్తున్న వాహనం బోల్తా

పెద్దతిప్పసముద్రం : టమాట బాక్సులతో వెళుతున్న ఓ బొలేరో వాహనం గురువారం పులికల్లు సమీపంలో బోల్తా పడింది. బొంతలవారిపల్లికి చెందిన గంగిరెడ్డి అనే రైతు పొలంలో పండించిన టమాట బాక్సులను ములకలచెరువు మార్కెట్‌కు తరలిస్తుండగా పులికల్లు సమీపంలో వాహనం అదుపు తప్పి పల్టీలు కొట్టింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనలో టమాట బాక్సులన్నీ నేలపాలు కావడంతో రైతుకు రూ.50 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు స్థానికులు పేర్కొన్నారు.

జలసంరక్షణ పనులకు అధిక ప్రాధాన్యత



నవోదయ పాఠశాలలో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ కట్టడాన్ని పరిశీలిస్తున్న సెంట్రల్ టీమ్ సభ్యులు

మదనపల్లె : జల సంరక్షణ, భద్రతే ధ్యేయంగా కేంద్రం జలశక్తి అభియాన్‌ను అమలుచేస్తోందని, ''ఎప్పుడు ఎక్కడ వర్షం కురిసినా ఒడిసిపట్టండి'' అనే నినాదంతో ఉపాధిహామీ పథకం నిధుల సంపూర్ణ వినియోగంతో భూగర్భ జలాలను పెంచే పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని సెంట్రల్ నోడల్ అధికారి ప్రకాష్ కచ్చి, జియాలజిస్ట్ ఏఎస్.పవార్ అన్నారు. గురువారం ఎస్‌ఆర్‌ఈజీఎస్ కింద మండలంలో జరుగుతున్న పనులను పరిశీలించారు.

ఇందులో భాగంగా వలసపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో చేపట్టిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ కట్టడాలు, ఇన్‌స్టిట్యూషనల్ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. విద్యార్థులతో నీటి సంరక్షణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, జలసంరక్షణలో ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ మద్దిలేటి, ఎంపీడీఓ భానుప్రసాద్, ఏపీడీ నందకుమార్‌రెడ్డి, మధుబాబు, ఏపీఓ సుబ్రహ్మణ్యం, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పూలసాగు గిట్టుబాటు అవుతోందా?
రైతుల్ని ప్రశ్నించిన కేంద్రబృందం సభ్యులు

గుర్రంకొండ : పూలతోటల సాగు గిట్టుబాటు అవుతోందా అంటూ కేంద్ర జలశక్తి నోడల్ అధికారి ప్రకాష్ కిచ్చి, జియోసైంటిస్ట్ ఏస్ పవార్‌లు రైతుల్ని ప్రశ్నించారు. గురువారం మండలంలోని అమిలేపల్లెలో వారు పర్యటించారు. ఈసందర్భంగా అక్కడి రైతులు ఉపాధిహామీ పథకం కింద సాగు చేసిన గులాబి తోటల్ని సందర్శించారు. పంట సాగు విధానంపై రైతుల్ని అడిగి తెలుసుకొన్నారు. పూలతోటల సాగు వలనే ఎంతమేరకు రైతులకు లాభాలు వస్తున్నాయి, మార్కెటింగ్ సౌకర్యం, ధరలు ఎలా ఉన్నాయి అన్న అంశాలను రైతులను అడిగి తెలుసుకొన్నారు. పూలతోటల సాగుతో గిట్టుబాటు అవుతోందని, మార్కెట్లో పూలకు మంచి ధరలు ఉన్నాయని, పూలకు మార్కెటింగ్ సౌకర్యం కూడా బాగుందని రైతులు వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి, అసిస్టెంట్ డైరెక్టర్ అవినాష్‌కుమార్, ఎంపీపీ సీతమ్మ, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఏపీవో జయరామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సెంట్రల్ నోడల్ ఆఫీసర్ల పర్యటన

చిన్నమండెం : మండలంలోని దిగువగొట్టివీడు, దేవగుడిపల్లె గ్రామాల్లో సెంట్రల్ నోడల్ ఆఫీసర్లు ప్రకాష్‌కిచ్చి, ఏఎస్ పవర్ సర్‌లు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు దిగువగొట్టివీడులో కమ్యూనిటీ సోక్ ఫిట్, దేవగుడిపల్లెలో బోర్‌వెల్ రీచార్జ్ పనులను తనిఖీ చేశారు. జిల్లాలో సంభవించిన కరువు పరిస్థితులను రాయచోటి ఏపీడీ రవికుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దివ్య, ఏపీఓ మాధవి, జేఈ హరూన్ బాషా, క్లస్టర్ టీఏలు నరసింహులు, సంపత్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

జల శక్తి అభియాన్ కేంద్ర బృందం పరిశీలన

కురబలకోట : కేంద్ర జలశక్తి అభియాన్ కేంద్ర బృంద పరిశీలక సభ్యులు ప్రకాష్, ఏఎస్ పవార్ గురువారం కురబలకోట మండలంలో పర్యటించారు. ముదివేడు మోడల్ స్కూల్‌లో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన తాగునీటి బోర్ వెల్ రీచార్జ్ స్ట్రక్చర్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ పనులను పరిశీలించారు. భూగర్భ జలాల పెంపులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని వారు కోరారు. డ్వామా పీడీ మద్దిలేటి, ఏపీడీ మధుబాబు, ఎంపీపీ బి. దస్తగిరి, ఎంపీడీఓ దిలీప్‌కుమార్, ఏపీఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.